క్లుప్తంగా

వ్యక్తిపై కేసు నమోదు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అంబవరం కొత్తపల్లె గ్రామంలో ఈనెల 11వ తేదీ రాత్రి గ్రామానికి చెందిన ముప్పాళ్ల వెంకట నరసయ్య అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌వలి అనే వ్యక్తి మద్యంసేవించి దుర్భాషలాడి గొడవపడ్డాడు. దీనిపై ముప్పాళ్ల వెంకట నరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

20 లోపు దరఖాస్తు చేసుకోండి

కనిగిరి రూరల్: ప్రకాశం జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ఉపకార వేతనాలు, పురస్కారాలు అందిస్తున్నట్లు ఆసంఘ నాయకుడు పెరుగుపల్లి పూర్ణ చంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2023–24 ఏడాదికి సంబంధించి పది, ఇంటర్, డిగ్రీ, నీట్, ఎంసెట్ ఫార్మసీ, పాలిటెక్నిక్ తదితర పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 8466959360, 9502500246ను సంప్రదించాలన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ



వెంకటేశ్వర్లుకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ చక్రపాణి

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లోని విద్యార్థులకు ప్రముఖ లైఫ్ స్కిల్స్.. కెరీర్ గైడెన్స్ శిక్షకుడు వి. వెంకటేశ్వర్లు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో భాగంగా రాబోవు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులలో ఆత్మ విశ్వాసం పెంపొందించారు. ఇదే విశ్వాసంతో మంచి మార్కులు సాధించి ఆర్థిక సమస్యల కారణంగా ఉన్నత చదువులు చదవలేని విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ టి. చక్రపాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సాహంగా ముందస్తు ఓనం వేడుకలు



కేరళ సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పామూరు: 'ఓనం' పండుగ ముందస్తు వేడుకలు మండల కేంద్రమైన పామూరు సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ యం.జయకుమార్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ' నమ్మకం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం' కు గుర్తింపుగా కేరళవాసులు ఓనం పండుగ నిర్వహిస్తారన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన కేరళ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న చైర్మన్

కనిగిరి రూరల్: పారిశుద్ధ్యం పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయిబాబా థియేటర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి.. ప్రజా ఫిర్యాదు మేరకు అక్కడ ఉన్న చెత్త డంపింగ్ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. జనావాసాల మధ్య చెత్త డంపింగ్ పాయింట్ ఏర్పాటు చేయడం వల్ల దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చైర్మన్‌కు విన్నవించారు కౌన్సిలర్ పసుపులేటి అరుణోదర్, బొట్టు శ్రీను స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పీహెచ్‌సీలో గర్భిణుకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: మండల కేంద్రం హనుమంతునిపాడు పీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మెడికల్ ఆఫీసర్ దార్ల హనుసందీప్ సూచనలు, సలహాలిచ్చారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



హెచ్‌ఎంపాడు ప్రభుత్వ ప్రజా వైద్యశాలలో కిటకిటలాడుతున్న జ్వరపీడితులు



హనుమంతునిపాడు పీహెచ్‌సీలో జ్వర పీడితులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

విషజ్వరాలతో విలవిల

- ఆర్‌ఎంపీ క్లినిక్‌ల వద్ద కిటకిటలాడుతున్న జ్వర పీడితులు
- భారీ మొత్తంలో వైద్య ఖర్చులు
- భరించలేక ఆందోళన చెందుతున్న పేదలు

హనుమంతునిపాడు:

మండల ప్రజలు విష జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో దోమల నివాస కేంద్రాలగా ఏర్పాటు చేసుకుని.. పల్లెల్లో ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో చిన్నారులు,పెద్దలు విష జ్వరాలతో తల్లడిల్లి పోతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లు కూడా పొంచి ఉండటంతో ఏం చేయాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. వేములపాడులో నాలుగు ఆర్‌ఎంపీ ఆస్పత్రులున్నాయి. ప్రతి ఆస్పత్రిలో జ్వర పీడితులు చికిత్స తీసుకుంటున్నారు. వేములపాడులో చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించే ఆర్‌ఎంపీ వైద్యులు వేలకు వేలు బిల్లులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిరుపేద కుటుంబాలు భారీ మొత్తం చెల్లించ లేక కష్టాలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరటి తోటలతో ఉపయోగం



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ



కేంద్రీయ విద్యాలయంలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

కందుకూరు రూరల్: పెరటి తోటలు పెంపకం ద్వారా తాజా పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.నిహారిక తెలిపారు. కందుకూరులోని కేంద్రీయ విద్యాలయం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంపూర్ణ అభివృద్ధి, సమతుల్య ఆహారం, తాజా పండ్లు, కూరగాయలు తినడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ ప్రతి రోజూ క్రమం తప్పకుండా పండ్లు, కూరగాయలు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. పెరటి తోటలు పెంపకంపై ఐదు రోజులుగా ప్రథమ శ్రేణి ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. పౌష్టికాహార లోపాలు నివారించడానికి రోజు వారి ఆహారంలో కనీసం 400 గ్రాముల కూరగాయలు, 100 గ్రాములు పండ్లు తీసుకోవడం తప్పనిసరి అన్నారు. విద్యార్థులకు ఆహార, పౌష్టికాహార భద్రతను బలోపేతం చేసే మెళకువలు తెలిపారు. పౌష్టికాహారం పెరటి తోటల వల్ల స్థానికంగా పండించే తాజా పండ్లు, కూరగాయలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఇవి ఆహార వైవిధ్యాన్ని పెంపొందించడానికి, అత్యవసరమైన సూక్ష్మపోషకాలు మనకు ప్రతి రోజు అందచేయడంలో సహాయపడతాయన్నారు. అలాగే పోషకాహార లోపం, ఆరోగ్య రుగ్మతలు అన్ని వయస్సుల వారిలో నివారించడానికి ఇవి తోడ్పడతాయన్నారు. పాఠశాల పరిసరాల్లో పెరటి తోటల పెంపకం ద్వారా పిల్లలకు పౌష్టికాహార, మధ్యాహ్న భోజనం అందించవచ్చన్నారు. దీని ద్వారా పెంపకంపై ఆసక్తి కలుగుతుందన్నారు. పిల్లలు మానసిక ఆరోగ్యానికి ఆటలతోపాటు పెరటి తోటల పెంపకం కూడా సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్ వైజర్ పార్వతి



పౌష్టికాహార ఆవశ్యకతపై వివరిస్తున్న సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ

పామూరు: పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ఇందుకోసం కిశోరబాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని బొట్లగూడూరు పీహెచ్‌సీ డాక్టర్ కె.హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ కిశోర బాలికలు రోజు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని తద్వారా అనీమియా బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, గుడ్లు, కాయగూరలు తినాలని కిశోర బాలికలకు సూచించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామారావు, పలువురు ఉపాధ్యాయులు, ఆశలు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక వాల్మీకి వీధిలోని అంగన్ వాడీ కేంద్రాన్ని శుక్రవారం చైర్మన్ తనిఖీ చేశారు. విధి నిర్వహణలో బాధ్యతా యుతంగా వ్యవహరించాలన్నారు.

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపర్ వైజర్ ఎంఎస్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లిలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. తొలుత పోషకాహార విలువలు, ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు ఎస్.ఎ స్‌కే శాంతి, ఆశ వర్కర్లు సుజాత, రమణమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

అసత్యాలు మానుకోవాలి

కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు ఆది ఆంధ్రకాలనీలో 2019 నుంచి 2024 వరకు చీమల వెంకటరాజా చెప్పిన అభివృద్ధి కార్యక్రమాలుని నిజమని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కాలనీవాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కల్వర్టు కూల్చివేసిన అగ్రవర్ణాలను వెనుకేసుకురావడంలో స్వలాభం ఏమిటని రాయపాటి శ్రీనివాసులను ప్రశ్నించారు. కాలనీ అభివృద్ధికి సహకరించిన బీసీ నాయకులపై అసత్య ప్రేలాపనలు మానుకోవాలన్నారు. చీమల వెంకట రాజాను చర్చలకు పిలిచే స్థాయి మీకు ముఖ్యంగా రాయపాటి శ్రీనుకు లేదన్నారు. నువ్వు ఎస్సీ మాదిగల పక్షమా? లేక కల్వర్టు కూల్చిన అగ్రవర్ణాల పక్షమా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట రాజా 1994 నుంచి కాలనీలో జరిగిన అభివృద్ధి అంతా తానే చేసినట్లుగా ఎక్కడా చెప్పలేదన్నారు. ప్రశ్నించిన అందలేదు. వెంకటేశ్వర్లుపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ తప్పుడు కేసు పెట్టి బ్లాక్ మెయిల్ చేసింది నిజం కాదా అన్నారు. నువ్వు ఎస్సీ సెల్ అధ్యక్షుడు అని చెప్పుకుంటూ ఎస్సీ మాదిగలను మోసం చేస్తూ ఎస్సీ కాలనీ మహిళల దగ్గర గ్యాస్ సిలిండర్లు ఇప్పిస్తానని డబ్బులు దండుకున్న విషయం మహిళలు ఎవరూ మర్చిపోలేదన్నారు. గత 15 సంవత్సరాల నుంచి కాలనీలో పెత్తనం చేలాయిస్తూ అనేక రకాలుగా మాదిగ కాలనీవాసులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. నీకు చిత్తశుద్ధి ఉంటే నీకు ఏ మాత్రం అయినా కులాభిమానం ఉంటే కల్వర్టు ధ్వంసం చేసిన వారిపై పోరాటం చేయాలన్నారు. అక్కడ నూతనంగా కల్వర్టును నిర్మించాలన్నారు. దీనిపై ఎమ్మార్పీస్ నాయకులు మా కాలనీని పరిశీలించి ధ్వంసం చేసిన కల్వర్టు విషయాన్ని వాస్తవ, అవాస్తవాలను పరిశీలించి రాయపాటి శ్రీనివాసులు నిజస్వరూపాన్ని గుర్తించాలని కోరారు. మండల ఎస్సీ సెల్ కార్యదర్శి కరేటి చిన్న కోటేశ్వరరావు, వార్డు మెంబర్ కరేటి ఆనందకుమార్, జి.మరిదాస్, కోట రజినీకాంత్, కోట మల్లికార్జున, కె.ఆదినారాయణ కె.మల్లేష్, గణేష్, కె.యోబు తదితరులు ఉన్నారు.

సీపీఎం అగ్రనేత ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



కనిగిరి: ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అచ్చిరెడ్డి, కేశవులు, వివిధ సంఘాలు



టంగుటూరు: సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీఎస్‌పురం(పామూరు): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ నాయకురాలు ఊసా రాజ్యలక్ష్మి అన్నారు. సీఎస్‌పురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు, ఫాసిస్ట్ వ్యతిరేక పోరాటాలకు తీరనిలోటన్నారు.

కనిగిరి రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు నిరంతరం పోరాటాలు సాగిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సుగుణావతమ్మ హాస్పిటల్ సెంటర్‌లో సీతారం ఏచూరి సంతాపం శుక్రవారం జరిగింది. అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీసీ కేశవులు మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం కడవరకు పోరాడిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని కీర్తించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలను సాగించిన గొప్ప నేత అని కొనియాడారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకుడు అచ్చిరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం, సీఐటీయూ, యూటీఎఫ్, జేవీవీ వివిధ సంఘాల నాయకులు బషీరా, కృష్ణమూర్తి, నరేంద్ర, పాండు రంగరావు, వి. మాలకొండారెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ మండల కన్వీనర్ వి. మోజెస్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుది వరకు పోరాడరన్నారు. నాయకులు టి.రాము, ఎం. యానాది, టి. వెంకట్రావు, టి. పాపారావు, డి. వెంకటేశ్వర్లు, పి. శ్రీను, సీపీఐ ప్రభాకర్, బి. సతీష్, ఎం. కాలేషా బేగ్ పాల్గొన్నారు.

సింగరాయకొండ: సీతారాం ఏచూరి సంతాప సభను నాయకులు వి. మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. హరిబాబు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తిత్వం గల నాయకుడు ఏచూరి అని కొనియాడారు. టంగుటూరి రాము, పి. రవికుమార్, పి. బాబూరావు, కోటపాటి నారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హిందీ దివస్



సాంస్కృతిక కార్యక్రమాలు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం సీహెచ్ పద్మజ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

కొండపి (సింగరాయకొండ): మండలంలోని కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్, హిందీ ఉపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమంలో అఖిలభారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహద పడిందన్నారు. జాతీయ భాష హిందీ యొక్క ప్రాధాన్యతను గుర్తించి చక్కగా నేర్చుకొని జాతీయ భావాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండపి : హిందీ భాష ప్రాముఖ్యత వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హలో మాల.. చలో ఒంగోలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పుల్లగూర కృష్ణయ్య

టంగుటూరు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా శనివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు అంబేడ్కర్ భవనంలో హలో మాల, చలో ఒంగోలు జరగనుంది. మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగే సభను జయప్రదం చేయాలని.. కొండపి నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు పులగర కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. బొడ్డు రవీంద్ర, దామవరపు రాంబాబు, పర్రె శ్రీను, కసుకుర్తి అగమన రాజు, ఎ.నాగేశ్వరరావు, రామకోటయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

కొండపి (సింగరాయకొండ): స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సబ్ స్టేషన్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ కుంచాల కోటయ్య తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పొగాకు లో గ్రేడ్ ధర ధమాల్



వేలం నిర్వహిస్తున్న అధికారి శ్రీనివాసరావు

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం లోగ్రేడ్ ధర కేజీకి రూ. 10 మేర వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులు లబోదిబోమన్నారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగేళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1354 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. అందులో 1009 బేళ్లను కొనుగోలు చేశారు. వ్యాపారుల వివిధ కారణాలతో 345 బేళ్ల ను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 358, కనిష్ట ధర కేజీ రూ. 180. సరాసరి ధర 266.88 పలికింది. శుక్రవారం నుంచి 11వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైందని వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు.

940 బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 940 బేళ్ల కొనుగోలు జరిగినట్లు వేలం నిర్వహణ అధికారి ఎ. శ్రీనివాసరావు తెలిపారు. నిడమానూరు క్లస్టర్ పరిధికి చెందిన రైతులు 1115 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. 940 బేళ్ల కొనుగోలు జరిగాయి. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 358, కనిష్ట ధర రూ. 190, సరాసరి ధర రూ 301.80 పలికింది. 11 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.